# డిటెక్టివ్ సుబ్బారావు

రచన:
శ్రీ డి. కృష్ణ

[కొందరు కలలు కంటూంటారు.
మరికొందరు కలలు కని ప్రయత్నాల్ని ఫలింపజేసుకొంటారు.
కొందరు కేవలం పగటి కలలుతోనే జీవిస్తూ కాలాన్ని వృథాపుచ్చి భ్రాంతితో ఫలితం అందజూస్తారు. యిలాంటి కోవలో అగ్రగణ్యుడుగా డిటెక్టివ్ సుబ్బారావ్ చేరగలడేమో! ఇక చదవండి!]

ప్రక్క గదిలో దబాదబా శబ్దం వినపడింది, సుబ్బరావు గుండె గుభేలు మంది. అర్ధ రాత్రిలో... పహుశా దొంగలయింటారేమో! నాలుక పిడచగట్టి వళ్ళంతా చెమటబోసి వణికి పోతూంది శరీరం. ఇప్పుడేం చేయాలి అరిస్తే... దొంగ పారిపోతాడు. అలా పారిపోతే యిన్నాళ్ళు కలలు గంటున్న పథకం తారుమారవుతుంది. ఛా... అలా చేయకూడదు.

సుబ్బారావ్! చేతులు అప్రయత్నంగా నేనికోసమో తారాడుతున్నాయి. చీకటిలో ప్రక్కనున్న పడక కుర్చీకి కాళ్లు తగిలి గల్లుమంటు బోర్లబడింది. మరో అడుగేస్తే మంచి నీళ్ళ పాత్ర దొర్లింది. నా మతి మండి పోను యిలా శబ్దం చేస్తే దొంగలు యింకా వుంటారా, పరుగు పెట్టిండరూ!... చట్టుక్కువ ప్రతిమలా నిలబడి పోయాడు సుబ్బారావ్!

మళ్ళీ దభీ దభీ మంది శబ్దం. ఓరి దొంగ ముండ నాయాలా! యింకా కన్నం వేస్తున్నలాగే వుందేం? వీడి కథ కాస్తా చూసేయాల్సిందే! రేపీపాటికి పోలీస్ స్టేషన్‌లో యిలానే దభీ దభీమని బాదుతూంటే మాసి తృప్తిపడాలి. ఇనస్పెక్టరు సాదరంగా చూసి "మెనీ కంగ్రాచ్యులేషన్స్ మిష్టర్ రావ్" మీలాంటివారు సంఘానికి ఎంతో అవసరమంటు షేక్‌హ్యాండ్ చేయాలి. ప్రభుత్వం ఓ గజ దొంగల ముఠాని పట్టిన ప్రతిభాశాలిగా తన్ను గుర్తించాల. అలాంటి సువర్ణావకాశం తనకిప్పుడు లభించింది. ఎంతో జాగ్రత్తిగా ఉపయోగించుకోవాలి.

పేపర్లో చూసినట్లు జ్ఞాపకం, ఈమధ్య దేశంలో గజ దొంగల నిష్పత్తి సాలీన రెండు శాతం పెరిగి పోతూందని. తను ఒకటా రెండా ఎన్నో చూశాడు యిలాంటి న్యూస్ బిట్లని. క్రితంసారి యిలానే ఓగజ దొంగల ముఠాని పట్టియిచ్చిన పౌరునికి ప్రభుత్వం యెంతగానో సన్మానించి, నగదు బహుమానంకూడ యిచ్చినట్టు జ్ఞాపకం తెచ్చుకున్నాడు సుబ్బారావ్!

అనాటి నుండి సుబ్బారావుకి, డిటెక్టివ్ కిరాయి కొట్టుకి ఎడతెగని సంబంధము తెగబలిసింది. ఎన్నో పుస్తకాల్ని చదివాడు. అంతా హత్యలు, బూతులు, పచ్చి శృంగారాలతో కలసిన చెత్త శవసాహిత్యమని తొలిరోజుల్లో అనుకొన్నం చదవగా చదవగా వేపకూడ తీపై, ఎంతో ఆనందాన్ని పంచిపెట్టేది సుబ్బారావ్‌కి ఆ పుస్తకాల్లో డిటెక్టివ్ దొంగల్ని, హంతకుల్ని ఎలా చాకచక్యంతో పట్టాడో, ఆ మధ్య ఎలాంటి పన్నాగాలు పన్నాడో యిత్యాది విషయాల్ని మనోమందిరంలో పథిలపరచుకొనేవాడు. అప్పుడప్పుడు కొన్ని సందర్భాల్లో తన సాహసాన్ని ప్రయోగించేవాడుకూడ.

అందులోను శృంగారసంయుక్తంగా రచయిత వెలువరించిన పచ్చిబూతుల్ని చూస్తే కొంత అసహ్యమనిపించినా మరీమరీ చదివి పర్సనల్ డైరీకిలోకి ఎక్కించేవాడు. అలాంటి రచయితను ఆరాధ్యదైవంగా పూజించేవాడు. ఇక హత్యలు, అందునా స్త్రీ హత్యలు యిత్యాది విషయాల్లోని లోతుపాతులు పూర్తిగా ఆకళించుకొని, అందులోని కథానాయకుని ధీరోధాత్తత, హత్యను పసిగట్టి, హంతకున్ని పట్టడంలో శతసహస్ర ముష్టియుద్ధాలు, పిస్టలు కాల్పులు అయినాక చిట్టచివరకు హంతకున్ని గిర్తించటము బాగా వంటబట్టినిపించాయి సుబ్బారావ్‌కి!

సుబ్బారావ్! ఆలోచనల్లోనే మరల గదిలో శబ్దం వినిపించింది. ఉలిక్కిపడి మరలా తేరుకొని దిగ్వుణీకృతోత్సాహంతో చీకటిలో మరింత కళ్ళు పెద్దవిచేసి గమనించసాగాడు ఉరఫ్ డిటెక్టివ్ సుబ్బారావ్!

కళ్ళకు సుస్పష్టంగా అగుపించకొన్న పొరపొరమంటు శబ్దం వినిపిస్తూంది. అ చీకటిలో ఓ ఆకారం

లాంటి చీకటిగుంపు ముందుకు దూసుక వచ్చినట్టయింది. ఉరఫ్ డిటెక్టివ్ పిస్టలు పేల్చినట్లు ఫిలయి బొటన వ్రేలిని మరిమరి నొక్కుతున్నాడు. అది బొటనవ్రేలని తెలిశాక గాని ఆ ప్రయత్నంనుండి వీగలేదు.

మరికొంత సేపు నిశ్శబ్దం.........

బహుశా దొంగ యేం చేస్తూంటాడు. బహుశా పరిసరాల్లో అలికిడి యేదైనా అవుతుందేమోనని పరికిస్తూండవచ్చు. చాలా తెలివైన దొంగలు మల్లెవుంది. ఎక్కడో చదివినట్టు ఆఖరికి చేతిగుర్తులు కూడలేకుండా జాగ్రత్త వహించి పారిపోవచ్చు. అప్పుడు తన ప్లానంత పూర్తిగా పాడైపోతుంది. అలాపోతే తనకెంత నష్టము, దేశానికెంత నష్టము.

ఓసారి ఎవరో నాయకుడు ఉపన్యసిస్తూ దేశంలో దొంగలు, దోపిడీలు, అరాచకశక్తులు ప్రజ్వలిస్తున్నాయి. అలాంటి సంఘవిద్రోహక శక్తుల్ని నిర్మూలించాలి. అలా నిర్మూలించడం ప్రతిపౌరుని కర్తవ్యం అంటు చేప్పాడు. నిజమే మరి! ఎటుచూసిన యీ దొంగల్ని పట్టి ప్రభుత్వానికి అప్పజెప్పడమే తన ప్రస్తుత కర్తవ్యమనుకున్నాడు సుబ్బారావ్!

తన ప్రస్తుత ప్రయత్నాన్ని గూర్చి మనస్సులోనే ఓసారి రిహార్సు చేసుకొన్నాడు. ఇలానే వెనకవేపుగా వెళ్ళి దొంగని తన హస్తాలతో బంధించాలి. ఊరికే హస్తాలతో బంధిస్తె దొంగ తెలివైనవాడైతే తనకే ప్రమాదం ఇలాంటప్పుడు 'జూబిలీ' పట్టుపట్టాలి.

'జూబిలీ, పట్టంటే జ్ఞాపకమొచ్చింది. అదేదో సినిమాలో ఆ పట్టుపట్టిన హీరో విలన్ని చితకబాదాడు. అసలు ఆ పట్టుబడితే రక్తస్రావమే ఆగిపోతుంది. మరీ తన్నుకుచావాల్సిందే! రేపు ఈ పూళ్ళోకుర్రాళ్ళంతా విరుచుకుపడ్డా నాకు నేర్పు అయ్యా! నాకు నేర్పంటు తనవట్టు గొప్పతనాన్ని అభినందించుకున్నాడు సుబ్బారావ్!

కళ్ళు మరంత పెద్దవిచేసి పరిసర వాతావరణాన్ని పరిశీలిస్తున్నాడు. పరిశీలనలో యేకంగా తేలిందేమిటంటే దొంగ ఒకడుగా వచ్చినట్లులేదు. చాలామందే వున్నట్టున్నారు. బహుశా వారు ప్రాణాపాయకరమైన ఆయుధాలు ఉపయోగించనూవచ్చు. అప్పుడేం చేయాలి? తనవద్ద ఉక్కుకవచంలాంటిది వుండివుంటే లెక్కచేసేవాన్నికాదు. అయినా మునిగిపోయిందేం లేదు. అలా ఆయుధాలతో ఆధునిక పరికల్తో పట్టుకొంటే నాప్రతిభేంవచ్చింది? ప్రతిభను నిరూపించుకోవాలంటే ఇలానే వాళ్ళని పట్టి అప్పగించాలి.

అడుగు మీద అడుగు వేసుకుంటు వెల్తున్నాడు. చీకటిలో ఆకారం హుందాగా చుట్టకాలుస్తోంది, ప్రక్కన మరికొన్ని అకారాలు మెల్లమెల్లగా ముందుకొస్తున్నాయి. ఇంతలో సుబ్బారావ్ మీదుగా తళుక్కుమంటు బాకు ప్రక్కకు దూసుకపోయింది. ఉరఫ్ డిటెక్టివ్ సుబ్బారావ్ ధైర్యంగా వెడుతున్నాడు.

క్షణంలో ఆకారాలు చీకటిలో అమాంతంగా అదృశ్యమయ్యాయి. డిటెక్టివ్ సుబ్బారావ్! నిర్వీణుడై నిల్చుండిపోయాడు. అతని గొంతుమాత్రం పారిపోయారు...పారిపోయారంటు పెగిలింది.

వంటగదిలో ఖంగుమని పాలపాత్ర నొర్లింది. వెంటనే మ్యావ్...మ్యావ్ శబ్దం, ఏమండి...ఏమండి పాడు పిల్లి పాలన్ని తోసేసింది. భార్యపిలుపుతో నిద్రలో నుండి ఈలోకంలో పడ్డాడు.

ఏమండి యేమిటా పారిపోవడాలు, మళ్ళి ఏపాడు డిటెక్టివ్ చదివారేంటి అంటు మెత్తగా మందలించిన భార్యవేపు దీనంగా చూశాడు డిటెక్టివ్ సుబ్బారావ్!





పంపులు

మరియు

మోటారులు

'ఎన్. ఎం. ఐ.' పంపులు, మోటారులు అమర్చి మీ పొటలద్వారా అధిక లాభము పొందండి. కొన్ని సంవత్సరాల పరిశోధనా ఫలితమే యీ పరికరములు.

తయారించువారు

[illegible] ఇండస్ట్రీస్ : : కొయంబతూరు-2